సాక్షి
చిత్తూరు
ఆదివారం । 11 । మే । 2025



పూతలపట్టులో మాక్ డ్రిల్

పూతలపట్టు మండలంలో శనివారం అడిషనల్ ఎస్పీ శివానంద కిశోర్ పర్యవేక్షణలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. - 10లో



గోసంరక్షణ ట్రస్టుకు విరాళాలు

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని గోసంరక్షణ ట్రస్టుకు శనివారం దాతలు విరాళాలు అందజేశారు. - 10లో



మామిడితోటపై ఏనుగుల దాడి

బంగారుపాళెం మండలం మొగిలిలో మామిడి తోటపై శుక్రవారం రాత్రి ఏనుగులు దాడి చేసి, చెట్లను ధ్వంసం చేశాయి. - 10లో

న్యూస్‌రీల్

వరసిద్ధుడి సేవలో ఆర్టీఐ కమిషనర్



స్వామి వారి చిత్రపటం అందుకుంటున్న కమిషనర్

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారిని శనివారం రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ (ఆర్టీఐ) చావలి సునీల్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారు లు ఘన స్వాగతం పలికి, స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనం పలికి, ప్రసాదం, స్వామి వారి చిత్రపటం అందజేశారు.

అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు రేపు

తవణంపల్లె: మండలంలోని అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 12వ తేదీన పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తామన్నారు. 11 గంటలకు ఆలయ మండపంలో స్వామివారికి సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. రాత్రి 7.30 గంటలకు ప్రాకారోత్సవం వైభవంగా జరుగుతుందని పేర్కొన్నారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజనలు, భక్తి కీర్తనల సంగీత కచేరి ఉంటుందన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామున స్వామివారికి అభిషేక పూజలు చేసి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శన సేవ క్యూలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు.

కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక రేపు



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లాధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

ఆచార్య దేవోభవ అని..

చిన్నారుల తప్పొప్పులు గుర్తించి, జ్ఞానోదయం కలిగించి.. వారి జీవితాల్లో అజ్ఞాన అంధకారాలను తొలగించే గురువులకు అన్యాయం జరగకూడదని భావించారు అధికారులు. కూటమి సర్కారు ఉపాధ్యాయ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో 'ఆచార్య దేవోభవ'అని తలచి.. బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టారు. ఇందుకు విద్యాశాఖాధికారులు నిద్రలేని రాత్రులు గడుపుతూ తప్పులు దొర్లకుండా.. టీచర్లకు నష్టం కలగకుండా ముందస్తు కసరత్తును పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.



చిత్తూరు డీఈఓ కార్యాలయం పక్కనున్న పాఠశాలలో నిర్వహిస్తున్న క్లియర్ వేకెన్సీల కసరత్తు

తప్పులు దొర్లకుండా.. నష్టం కలగకుండా

- బదిలీలు, ఉద్యోగోన్నతుల కసరత్తు వేగవంతం
- ఉమ్మడి చిత్తూరు జిల్లా కసరత్తు ప్రక్రియలో విద్యాశాఖ నిమగ్నం
- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న ప్రక్రియ
- పర్యవేక్షించిన చిత్తూరు, తిరుపతి డీఈవోలు వరలక్ష్మి, కేవీఎన్ కుమార్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉండాల్సిన టీచర్ల పోస్టుల వివరాలు	
ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని మంజూరు పోస్టులు	723
మండల పరిషత్, జిల్లా పరిషత్ పరిధిలో మంజూరు పోస్టులు	15,552
నగరపాలక కార్పొరేషన్ మంజూరు పోస్టులు	589
మున్సిపాలిటీ పోస్టులు	508
మొత్తం పోస్టులు	17,372

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న టీచర్ల వివరాలు	
ప్రభుత్వ యాజమాన్యంలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు	598
మండల పరిషత్, జెడ్పీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు	13,969
నగరపాలక కార్పొరేషన్ పరిధిలో:	454
మున్సిపాలిటీ పరిధిలో:	433
మొత్తం విధులు నిర్వహిస్తున్న టీచర్లు:	15,454

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ త్వరలో నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియలో ముందస్తు కసరత్తును చిత్తూరు విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. శనివారం చిత్తూరు జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ కసరత్తు నిర్వహించారు. ఈ ప్రక్రియలో తప్పులు దొర్లకుండా..ఉపాధ్యాయులకు నష్టం కలగకుండా విద్యాశాఖ అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. ఈ కసరత్తులో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖ అధికారులు, డీవైఈఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

పకడ్బందీగా చర్యలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 66 మండలాల్లో త్వరలో ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియ ఉమ్మడి చిత్తూరు పరిధిలో నిర్వహించనుండడంతో చిత్తూరు విద్యాశాఖ అధికారులు, సిబ్బంది నిద్ర లేని రాత్రులు గడుపుతూ కసరత్తు చేపడుతున్నారు. ఈ ప్రక్రియలో ఏ ఒక్క పోస్టును బ్లాక్ చేయకుండా కసరత్తు నిర్వహిస్తున్నారు. గత నాలుగు నెలలుగా నిర్వహిస్తున్న

ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఖాళీల వివరాలు	
ప్రభుత్వ యాజమాన్యంలో ఖాళీలు	125
ఎంపీపీ, జెడ్పీ పరిధిలోని ఖాళీలు	1583
నగరపాలక కార్పొరేషన్‌లోని ఖాళీలు	135
మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీలు	75
మొత్తం ఖాళీలు	1,918

పక్కాగా కసరత్తు..

ప్రస్తుతం నిర్వహిస్తున్న క్లియర్ వేకెన్సీ కసరత్తును విద్యాశాఖ అధికారులు పక్కాగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియలో క్లియర్ వేకెన్సీ చూపేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో కేడర్ల వారీగా ఖాళీలను గుర్తిస్తున్నారు. మృతి చెందిన టీచర్లు, వీఆర్ఎస్ తీసుకున్న టీచర్లు, ఉద్యోగ విరమణ ఖాళీలు, ఐదేళ్లు పూర్తి చేసుకున్న హెచ్ఎంల ఖాళీలు, 8 ఏళ్లు పూర్తి చేసుకున్న టీచర్ల స్థానాలు, స్టడీ సెలవులపై వెళ్లిన టీచర్ల ఖాళీలు, వివిధ కారణాలతో పోక్సో కేసుల్లో ఉన్న టీచర్ల ఖాళీలను క్లియర్ వేకెన్సీలుగా గుర్తిస్తున్నారు. ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, అనంతరం రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు జాబితాను పంపనున్నారు.



టీచర్ల సీనియారిటీ, ఖాళీల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ ప్రక్రియలో కీలక ఘట్టం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో నిర్దిష్టమైన ఖాళీలు (క్లియర్ వేకెన్సీలు) చూపే ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియను చిత్తూరు డీఈఓ వరలక్ష్మి, తిరుపతి డీఈఓ కేవీఎన్ కుమార్, డీఈఓ కార్యాలయ ఏడీ వెంకటేశ్వరరావు, డీవైఈఓలు ఇందిర, బాలాజీ, లోకేశ్వరరెడ్డి, 66 మండలాల ఎంఈఓలు, పర్యవేక్షించారు.

6 వేల ఖాళీలు చూపే అవకాశం

చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల వ్యాప్తంగా ప్రస్తుతం 1,918 ఖాళీలున్నాయి. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రక్రియలో 6 వేల వరకు ఖాళీలు చూపించే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారుల వెల్లడిస్తున్నారు. అలాగే ఉద్యోగోన్నతులు, మిగిలిన ఖాళీలకు తాజాగా నిర్వహించే డీఎస్సీలో వచ్చే టీచర్లను భర్తీ చేసేందుకు కసరత్తు చేపడుతున్నారు. క్లియర్ వేకెన్సీల వివరాల ఆధారంగా మొదట్లో బదిలీ ప్రక్రియ నిర్వహిస్తారు. ఆ తర్వాత 1:2 విధానంలో ఉద్యోగోన్నతుల జాబితా విడుదల చేయనున్నారు.

కుంజేగానూరులో భూచోళ్లు



గుట్టభూములను చదును చేస్తున్న జేసీబీ

కుప్పం: పశువులకు మేతకు సౌకర్యంగా ఉన్న గుట్ట పోరంబోకుపై కొందరు కూటమి నేతల కన్ను పడింది. గుట్టకు ఆనుకుని ఉన్న డీకేటీ భూములను చూపిస్తూ గుట్ట పోరంబోకును చదును చేసి లేఅవుట్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లను పెట్టి చదును చేసి లేఅవుట్‌గా మార్చి ప్లాట్లు వేసి, లాభార్జన గడించే పనిలో కూటమి నేతలు నిమగ్నమయ్యారు.

గుట్టపోరంబోకు చదును

మండలంలోని కుంజేగానూరు రెవెన్యూ పరిధిలో బస్టాండ్ వద్ద 2.40 ఎకరాల గుట్టపోరంబోకు స్థలం ఉంది. ఈ భూమిలో కుంజేగానూరు, ఎస్.కొత్తపల్లి, నూటకుంటకు చెందిన గ్రామాల్లోని పశుపోషకులు పశువుల మేత బీడుగా ఉపయోగిస్తున్నారు. కుంజేగానూరు బస్టాండ్‌కు ఎదురుగా రోడ్డు పక్కన ఉండడంతో ఈ భూములపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. దీన్ని ఎలాగైన కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేపట్టారు. తమ అనుభవంలో ఉన్నట్లు కొందరు టీడీపీ నేతలు నకిలీ రికార్డులు సృష్టించి, స్వయం ఉపాధి కోసం రెండు దుకాణాల రూములను నిర్మిస్తున్నారు. 2.40 ఎకరాల గుట్ట పోరంబోకును చదును చేసి ప్లాట్లుగా మార్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇది ఇలా ఉండగా మరోవైపు గరికచీనేపల్లెకు చెందిన ఓ టీడీపీ ప్రధాన నేత కుంజేగానూరుకు వెళ్లే ఆవుల ఓనిని పూర్తిగా చదును చేసి, బొప్పాయి పంటను సాగు చేస్తున్నాడు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పశువులను అటవీ ప్రాంతంలో మేతకు తీసుకువెళ్లేందుకు ఈ ఆవులఓనిగా వినియోగించేవారు. టీడీపీ నేత దాన్ని ఆక్రమించడంతో వారు ఇక్కట్లు పడుతున్నారు.



ఆవుల ఓనిని చదును చేసి సాగు చేసిన బొప్పాయి

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

టీడీపీ నేత ఆవుల ఓని చదును చేసి, పొలంలో కలుపుకుని బొప్పాయి సాగు చేస్తున్నారని గతంలో రెవెన్యూ అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీన్ని అసరాగా చేసుకుని మరికొందరు టీడీపీ నేతలు గుట్టపోరంబోకు కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై రెవెన్యూశాఖాధికారులకు ఫిర్యాదు చేయగా తాము డీకేటీ పట్టా పొందామని రికార్డులు చూపిస్తూ వ్యవహరిస్తునట్లు సమాచారం. ఉన్న తాధికారులు స్పందించి ఆక్రమాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.

అంతా నా ఇష్టం!



చిత్తూరులోని ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయం

- డీఎస్పీ వాహనాన్ని లాగేసుకున్నా నోరెత్తకూడదు
- యూనియన్ ఆఫీస్‌ను ఖాళీ చేయించేందుకు యత్నం
- 'బాస్'కు వాస్తవాలు చెప్పలేక కుమిలిపోయిన ఖాకీలు
- చిత్తూరు 'ఏఆర్'లో 'సూపర్‌బాస్'గా చెలామణి

చిత్తూరు అర్బన్: ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్)..లా అండ్ ఆర్డర్. పోలీసుశాఖకు ఈ రెండూ గుండెకాయ, మెదడు లాంటివి. ఏ ఒక్క విభాగంలో చిన్న తేడా వచ్చినా.. ఒకరి ఒంటెద్దు పోకడతో ఇంకొకరికి ఇబ్బందులు తప్పవు. చిత్తూరు పోలీసుశాఖలోని ఏఆర్ విభాగంలో 'చిన్నబాస్'గా చలామణి అవుతున్న ఓ వ్యక్తి ఏకంగా తనకు తానే 'సూపర్‌బాస్' అనుకుని భ్రమలో ఉన్నతాధికారుల పైనే కాలు దువ్వాడు. విషయం 'బాస్' ఎదుట కక్కలేక, తమలో తాము మింగలేక చాలా మంది ఖాకీ అధికారులు లోలోపల కుమిలిపోయారు. ఉదయించిన 'భాస్కరు'డు అస్తమించిక తప్పదన్నట్లు.. ఇప్పుడు ఆ వ్యక్తి చేసిన ఒక్కో ఘన కార్యం వెలుగులోకి వస్తోంది.

ఎవరైనా లెక్కలేదంతే..

జిల్లా పోలీసుశాఖలో ఎస్పీ తరువాత ఏఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఆర్డర్ వారీగా ఉంటారు. ఇందులో ఓ కానిస్టేబుల్ డీఎస్పీతో మాట్లాడాలంటే ఓ విధానం ఉంది. అదే కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌తో మాట్లాడలన్నా ఓ పద్ధతి ఉంటుంది. కానీ ఏఆర్‌లో పనిచేసే ఓ వ్యక్తి ఏకంగా ఏఎస్పీలనే నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయిలో మాట్లాడుతున్నట్లు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఇక డీఎస్పీ అంటే అస్సలు లెక్కలేదు. కనీసం తనతోటి ర్యాంకు ఉన్న వ్యక్తితో ప్రవర్తించే తీరు కూడా వివాదస్పదమే. జిల్లా పోలీసుశాఖలో పనిచేసే ఓ డీఎస్పీ తనకు ఆరోగ్యం బాగాలేదని సెలవుపై వెళ్లారు. ఈ సమయంలో వాహనాన్ని హెడ్‌క్వార్టర్‌కు అప్పగించారు. తిరిగొచ్చి వాహనం అడిగితే, ఎవరూ సమాధానం చెప్పలేదు. తీరా విచారిస్తే ఆ సూపర్‌బాస్ డీఎస్పీ వాహనాన్ని మరో ప్రాంతానికి పంపేసినట్లు తెలుసుకున్నారు. ఇప్పటికే తనకు ఆరోగ్యం బాగాలేదని, ప్రయాణానికి అనుగుణంగా ఉండేందుకు రూ.లక్ష వరకు తన వాహనానికి ఖర్చు చేశానని, దాన్ని తిరిగి ఇవ్వాలని రిక్వెస్ట్ చేసినా ఆ వ్యక్తి అస్సలు పట్టించుకోలేదని సమాచారం. అసలు తనకు ఎందుకు ఫోన్ చేశారంటూ ఎదురు ప్రశ్నించి, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆ అధికారి కుంగిపోయి తనకు జరిగిన అవమానం ఎవరికీ చెప్పకుండా మదనపడిపోతున్నారు.

నీడను కూల్చే యత్నం..


నాలుగు వేల మందికి పైగా సిబ్బంది ఉన్న పోలీసుశాఖకు జిల్లా కేంద్రంలో యూనియన్ కార్యాలయం పెట్టుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఎవరైనా ఖాకీలు వస్తే యూనియన్ ఆఫీస్‌లో కాసేపు సేదతీరి, తమతోటి సిబ్బందిని పలకరించడానికి ఓ నీడ ఉందనే ఆనందంలో ఉన్నారు. కానీ యూనియన్ వాళ్లతో గిట్టని ఆ 'సూపర్‌బాస్' ఏకంగా ఆ కార్యాలయాన్నే ఖాళీ చేయాలని నిశ్చయించుకున్నారు. ఏఆర్ కార్యాలయం లోపల యూనియన్ ఆఫీస్ ఎలా పెట్టుకుంటారని, దీన్ని ఖాళీ చేయాలని ఖాకీలపైనే ఒత్తిడి తీసుకొచ్చాడు. విషయం ఎవరికి చెప్పుకోవాలో, ఏం చెబితే ఏం జరుగుతుందోనని యూనియన్ నాయకులు సైతం నోరెత్తలేదు. తీరా విషయం బాస్‌కు తెలియడంతో ఆయన కల్పించుకోవడంతో యూనియన్‌కు నిలవడానికి నీడైనా దొరికినట్లయ్యింది. అన్నింటికీ ఒక్కటే కారణం.. 'ఏయ్ నేను ఇంతకు ముందు ఎక్కడ పనిచేశానో తెలుసా..? సీఎం పేషీకు ఫోన్ చేయమంటావా..?' అనే మాటలు అందరి నోళ్లు మూయించేశాయి. మరి ఆ పేషీ నుంచే 'సూపర్ బాస్'కు మళ్లీ జిల్లాలో పనిచేయడానికి ఆదేశాలు వస్తాయో..? ఏకంగా సీఎం వద్దే బాధ్యతలు నిర్వర్తించే భాగ్యం దక్కుతుందో వేచి చూడాలి.

గిరిజనం.. అభివృద్ధి ఖాయం

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గిరిజన గ్రామాల అభివృద్ధి కల సాకారం కానుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దార్తి అభ జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం అందుకు ఊపిరి పోయనుంది. ఈ పథకం అమలుకు పలమనేరు మండలంలోని జగమర్ల ఎంపికైంది. దీంతో ఆ పల్లె ప్రగతి పథంలో నడవనుంది.



జగమర్ల యానాదికాలనీ నుంచి తుంబకుప్పం వెళ్లే మట్టి రోడ్డు



జగమర్ల యానాదికాలనీ

ఇక జగమర్ల గ్రామానికి మహర్దశ

- దార్తి అభ జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ ద్వారా అభివృద్ధి
- జిల్లాలో పలమనేరు మండలంలోని జగమర్ల ఎంపిక
- యానాదుల జీవన ప్రమాణాల పెంపునకు కేంద్రం చర్యలు
- విద్యాభివృద్ధికి ప్రత్యేక పాఠశాలలు, ఉపాధికి పెద్దపీట

పలమనేరు: అభివృద్ధిలో వెనుకబడి ఎక్కడో విసిరేసినట్టున్న గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్రం నడుం బిగించింది. అన్ని గ్రామాలతో సమానంగా గిరిజన గ్రామాలను సైతం అభివృద్ధి చేసి, గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం దార్తి అభ జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని గత ఏడాది గాంధీ జయంతి రోజున ప్రారంభించింది. దేశంలోని 63 వేల గిరిజన గ్రామాల్లో ఐదు కోట్ల మందికి లబ్ధి చేకూరేలా రూ.80 వేల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. చిత్తూరు జిల్లాలోని జగమర్ల, మొగిలిపాదరేవులు, కల్లిగుట్ట గ్రామాలను పరిశీలించి, వీటిలో అత్యంత వెనుకబడిన పలమనేరు మండలంలోని జగమర్ల గ్రామాన్ని తొలిదశలో ఎంపిక చేసినట్టు జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి మూర్తి తెలిపారు.

గ్రామంలో ఏమి చేస్తారంటే..

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధుల ద్వారా గ్రామంలో విద్యకు పెద్దపీట వేస్తుంది. ఇందుకోసం ప్రత్యేక రెసిడెన్షియల్ గిరిజన పాఠశాల ఏర్పాటు చేయనుంది. మరోవైపు ఉపాధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించనుంది. గ్రామంలో ఎక్కువగా చేసే పనులను గుర్తించి, వాటిని పెంచి జీవనోపాధి పెంచే కార్యక్రమాలు చేపట్టనుంది. గిరిజన కార్పొరేషన్ ద్వారా అటవీ ఉత్పత్తుల అమ్మకాలు, పాడి పరిశ్రమ అభివృద్ధిలాంటివి ఉంటాయి.

పట్టి పీడిస్తున్న రోడ్డు సమస్య ఇదీ..

దేవళంపెంట(యానాదికాలనీ) నుంచి తుంబకుప్పం గ్రామానికి కేవలం ఆరు కిలోమీటర్లు మాత్రమే. ప్రస్తుతానికి ఈ రహదారి మట్టిరోడ్డుగా ఉంది. ఈ మార్గంలో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది. ఈ రోడ్డును బాగు చేసి, తారు రోడ్డుగా మార్చితే పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బంగారుపాళెం, తవణంపల్లె, సోమల మండలాలకు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. అలాగే పీలేరు, పూతలపట్టు, తవణంపల్లె, సదుం, సోమల, చౌడేపల్లెకు వెళ్లేందుకు జగమర్ల గిరిజనులకు అనుకూలంగా ఉంటుంది. ఇక పలమనేరు, బంగారుపాళెం, తవణంపల్లె, సోమల, పెద్దపంజాణి మండలాలలోని ఆరు మారుమూల అటవీ గ్రామాలకు రాకపోకల సౌకర్యం కలుగుతుంది.

ఆనందంగా ఉంది



ఎక్కువగా ఎస్టీలున్న తమ గ్రామం జనజాతీయ గ్రామ్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ఆ నిధులతో మా గ్రామం బాగుపడుతుందని అనుకుంటున్నాం. ఇక్కడున్న యానాదుల అభ్యున్నతి విద్యతోనే సాధ్యమని నమ్ముతున్నా.

– విజయ్, సర్పంచ్, జగమర్ల, పలమనేరు మండలం

6 కిలోమీటర్ల రోడ్డు వేస్తే అభివృద్ధి



మా గ్రామస్తులు పండించిన పంటను బంగారుపాళెం, పుంగనూరు, చౌడేపల్లి, సోమలకు తరలించాలంటే పలమనేరు హైవేలో కెళ్లి బంగారుపాళెం వెళ్లాలి. సోమల, చౌడేపల్లికి వెళ్లాలంటే పలమనేరుకు వెళ్లి చౌడేపల్లి, పుంగనూరు చుట్టుకుని వెళ్లాల్సివస్తోంది. అదే తుంబకుప్పం రోడ్డు పనులు జరిగితే రైతులకు చాలా మేలుగా జరుగుతుంది.

– రెడ్డెప్పరెడ్డి, జగమర్ల, పలమనేరు మండలం

గోసంరక్షణ ట్రస్టుకు విరాళాలు



విరాళం అందజేస్తున్న దాత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని గోసంరక్షణ ట్రస్టుకు ఇద్దరు దాతలు శనివారం రూ.లక్ష వంతున విరాళాలు ఇచ్చారు. గుంటూరుకు జిల్లాకు చెందిన సూరిశెట్టి రమేష్ రూ.లక్ష నగదును ఆలయాధికారులకు అందజేశారు. ఆలయాధికారులు దాతకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే చెన్నైకు చెందిన దాత కలవకుంట ప్రత్యోత్ రూ.లక్ష నగదు ఆలయాధికారులకు అందజేశారు. ఆలయ సిబ్బంది కోదండపాణి దాత కుటుంబానికి ప్రత్యేక దర్శనం కల్పించారు.

పెళ్లి పేరుతో వంచన

పుంగనూరు: పట్టణానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని మోసగించిన యువకుడిపై ఆమె శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రామసముద్రం మండలం చింపరపల్లికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. అదే మండలంలోని ఓ యువతి తండ్రితో ఆర్థిక లావాదేవిలు అడ్డు పెట్టుకుని అధిక వడ్డీలకు అప్పు ఇచ్చి ఇల్లు రాసుకున్నాడు. ఇలా మోసం చేస్తూ నిలదీసినందుకు యువతిని ప్రేమ పేరుతో మోసగించి, గర్భవతిని చేశాడని ఆమె పోలీసులకు కిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భావప్రకటన స్వేచ్ఛపై ఎదురుదాడి



- పేరుకుపోయిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- 20 లక్షల ఉద్యోగాలకు జాబ్ క్యాలండర్ ఏదీ?
- రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేటు రంగాల హవా
- సంక్షేమం గాలికి వదిలేశారు
- తప్పును ఎత్తి చూపితే కేసులు, దాడులా?
- 'సాక్షి'తో మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు

తిరుపతి సిటీ: 'ప్రజాస్వామ్యంలో భావప్రకటనా స్వేచ్ఛ ప్రాథమిక హక్కు. రాష్ట్రంలో అలాంటి హక్కుకు భంగం కలిగేలా ఘటనలు జరగడం ప్రమాదకరం. పత్రికా స్వేచ్ఛను హరించే చర్యలు చట్ట విరుద్ధం. ప్రభుత్వం చేసే తప్పును ఎత్తి చూపితే కేసులు, భయభ్రాంతులకు గురిచేసేలా దాడులు చేయడంలో ఆంతర్య మేమిటో అర్థంకాని పరిస్థితి. రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థల హవా కొనసాగుతోంది. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదు. సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. ఉద్యోగ, ఉపాధి రంగాలపై దృష్టి లేదు'..అని మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏడాదిగా సాగుతున్న పాలనపై తన అభిప్రాయాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. ఇంకా ఏమన్నారంటే..



సాక్షితో ఫేస్ టూ ఫేస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

బలహీన పడుతున్న విద్యావ్యవస్థ

రాష్ట్రంలో పాఠశాలలు బలహీన పడే పరిస్థితి నెలకొంది. 9 రకాల పాఠశాలల ఏర్పాటు అనే కాన్సెప్ట్‌తో ప్రభుత్వం నూతన సంస్కరణలను ప్రవేశపెట్టింది. దీంతో వందల సంఖ్యలో పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉంది. సుమారు 10వేల ఉపాధ్యాయ పోస్టులు సర్‌ప్లస్ కానున్నాయి. గత ప్రభుత్వంలో మ్యాథ్స్, ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు ఇచ్చిన ప్రమోషన్లు రద్దు కానున్నాయి. కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు విలయతాండవం చేయనున్నాయి. ప్రైవేటు యూనివర్సిటీలను ప్రొత్సహించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నాడు-నేడు పథకంతో గత ప్రభుత్వం పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించింది. మరికొన్ని పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాల్సి ఉంది. వాటిని పట్టించుకోవడం లేదు. 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని గత ప్రభుత్వ చర్యలు తీసుకుంటే, కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వక్తుల చేతుల్లో పెట్టడం సరైన పద్ధతి కాదు.

డీఎస్సీపై ఆంక్షలు దారుణం

మెగా డీఎస్సీ పేరుతో 16 వేల పోస్టులకు పైగా విడుదల నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం అందులో ఆంక్షలు విధించడం దారుణం. అభ్యర్థుల వయోపరిమితి 47కు పెంచాల్సిన అవసరం ఉంది. అభ్యర్థుల ప్రిపరేషన్‌కు కనీసం 90 రోజులు గడువు ఇవ్వాలి. అర్హతల పేరుతో మార్కుల శాతం పరిగణనలోని తీసుకునేలా నిబంధనలు విధించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో ప్రతి జిల్లాకు వేర్వేరుగా ప్రశ్న పత్రాలు ఇవ్వాలి.

తప్పు ఎత్తిచూపే హక్కు మీడియాకుంది

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యవహార శైలి ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉంది. భావప్రకటనా స్వేచ్ఛపై ఎదురుదాడికి దిగుతోంది. ప్రభుత్వం చేసిన తప్పును ఎత్తి చూపే హక్కు పత్రికలకు, మీడియాకు ఉంది. అలాంటి వాటిని స్వీకరించి తప్పులను సరిదిద్దుకోవాలి. కానీ అలా జరగకపోగా మీడియా ప్రతినిధులపైన, కలం కార్మికులపైన దాడులు చేయడం దారుణం. భయపెట్టడం, కేసులు బనాయించడం దారుణం. ప్రతికా చ్ఛను హరించడం రాజ్యాంగ విరుద్ధం.

20 లక్షల ఉద్యోగాల మాటేంటో?

నిరుద్యోగులకు ప్రతి నెలా నిరుద్యోగ భృతి రూ.3వేలు, 20 లక్షల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండ్ విడుదల హామీలు ఏమయ్యాయో. ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు పారిశ్రామిక, ఐటీ రంగాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇంతవరకు ఆ దిశగా అడుగులు పడలేదు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో సుమారు 2 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీలీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయాలి.

సంక్షేమం గాలికే

కూటమి ప్రభుత్వం అధికారం కోసం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది. రైతులకు అన్నదాత సుఖీభవ, ప్రతి కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకాలు నిర్వీర్యమయ్యాయి. వాటి ప్రస్తావనే ఎత్తడం లేదు. పీ4, స్వరాంధ్ర 2.0 అంటూ స్వప్నలోకంలో ప్రగతి జరుగుతున్నట్లు ఉంది. రాబోయే నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్న గ్యారంటీ లేదు.

చైన్ స్నాచర్ అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారు చైన్లు, బైక్‌తో నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐ

నగరి : కొంతకాలంగా నగరి, విజయపురం ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల్లో వెళుతూ ఒంటరిగా ఉన్న మహిళల మెడలో చైన్లను చోరీ చేస్తూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న చైన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ లు కథనం మేరకు.. నగరి సబ్‌డివిజన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసుల ఛేదనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా నగరి పరిసర ప్రాంతాలు, తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పాత నేరస్తులతో పాటు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచారు. శనివారం ఉదయం సీఐకి అందిన సమాచారం మేరకు, నాగలాపురం జంక్షన్ వద్ద విజయపురం మండలం, ఇల్లత్తూరుకు చెందిన అజిత్ (27)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ఆనంతప్పనాయుడుకండ్రిగ, విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనంలో వచ్చి మహిళల మెడలో చైన్ స్నాచింగ్ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. అతని వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఒక అపాచీ మోటార్ సైకిల్, చోరీ చేసిన సుమారు రూ.4 లక్షల విలువైన 45 గ్రాముల బరువు రెండు బంగారు బొందు చైన్లులు స్వాధీనం చేసుకున్నారు. అజిత్ అరెస్టులో ప్రతిభ కనబరిచిన సిబ్బంది లోకనాథం, గణేష్, ధన కోటి, రమేష్‌ను అభినందించడంతో పాటు వారికి రివార్డులు అందించారు.

నూతన కార్యవర్గం



జిల్లా పరిషత్ యూనిట్ నూతన కార్యవర్గం సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా పరిషత్ యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీ వివరాలను ఎన్నికల అధికారి పీఎంఆర్ ప్రభాకర్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా సురేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా చలపతిరెడ్డి, సుజాత, లక్ష్మీపతి, కార్యదర్శిగా రాజేంద్రన్, సహాయ కార్యదర్శులుగా రూప్‌సాగర్, బాలకృష్ణ ఎన్నికయ్యారు. అలాగే కార్యనిర్వాహక కార్యదర్శిగా చక్రవర్తి, కోశాధికారిగా వాసుదేవరావు, జిల్లా కౌన్సిలర్లుగా గిరిధర్‌రెడ్డి, శశిధర్ చౌదరి, చంద్రశేఖర్‌రెడ్డి, తులసీరామ్, దస్తగిరిసాహెబ్, సుష్మకీర్తి, శ్రీనివాసులు, హరీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఎన్నికలకు పరిశీలకులుగా చెంచురత్నం, చక్రపాణి వ్యవహరించారు.

మామిడితోటపై ఏనుగుల దాడి



ఏనుగుల దాడిలో రాలిన మామిడి కాయలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలిలో శుక్రవారం రాత్రి మామిడితోటపై ఏనుగులు దాడి చేశాయని బాధిత రైతు తెలిపాడు. గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు గౌనిచెరువు వద్ద మామిడితోట ఉంది. సమీపంలోని కౌండిన్య అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు మామిడితోటలోకి ప్రవేశించి చెట్ల కొమ్మలను విరిచి కాయలను కొరికి నేలపాలు చేశాయని తెలిపారు. పంట చేతికందే సమయంలో ఏనుగులు తోటపై దాడి చేసి నష్టపరిచాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఏనుగులు తరచూ రైతుల మామిడి తోటలపై దాడులు సాగిస్తున్నట్లు తెలిపారు. అటవీశాఖాధికారులు ఏనుగులు పంటలపైకి రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరం

పాలసముద్రం: మండలంలోని కన్నికాపురం సమీపంలోని వంకలో శనివారం కుక్కల దాడిలో జింక మృతి చెందింది. వేసవి కారణంగా అడవిలో నీరు లేకపోవడంతో కన్నికాపురం దళితవాడకు సమీపంలోని వంకలో నీరు తాగడానికి వచ్చిన జింకను గమనించిన వీధి కుక్కలు మూకుమ్మడిగా దానిపై దాడి చేసి, గాయపరిచాయి. దీంతో జింక మృతి చెందింది.

పూతలపట్టులో మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలంలో శనివారం అడిషనల్ ఎస్పీ శివా నంద కిషోర్ పర్యవేక్షణలో మాక్ డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ యూనిట్ వంటి కీలక ప్రదేశాల్లో ఉగ్రదాడులు జరిగినప్పుడు ఉద్యోగులు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, సైరన్లు మోగినప్పుడు అనుసరించాల్సిన భద్రతా ప్రోటోకాల్, బాంబు బెదిరింపుల సమయంలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ చర్యలు, అలాగే హెల్త్, ఫైర్ రెస్పాన్స్ టీమ్‌ల పాత్రను ఈ డ్రిల్‌లో ప్రాక్టికల్‌గా చూపించారు. ఐఓసీఎల్ వంటి ఇంధన సంస్థలు ఉగ్రవాదులకు లక్ష్యంగా మారే అవకాశం ఉన్నందున భద్రతా చర్యలు అత్యంత కీలకమని పోలీసు అధికారులు పేర్కొన్నారు. అనుమానాస్పదంగా ఉన్న బ్యాగులు, ప్యాకెట్లు, పరికరాలను సిబ్బంది తాకకూడదని, వెంటనే పోలీసులకు లేదా బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. డీఎస్పీలు సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్ని కృష్ణ, పూతలపట్టు సీఐ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వెరిటాస్ సైనిక్ స్కూల్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి

- దేశ రక్షణకు విద్యార్థులను తయారు చేయడమే వెరిటాస్ లక్ష్యం
- వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బీ.శేషారెడ్డి



మాట్లాడుతున్న వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బీ.శేషారెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో గత 22 ఏళ్లుగా బీఎస్ఆర్ విద్యాసంస్థల ద్వారా క్రమశిక్షణతో కూడి విద్యతో పాటు వేలాది మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఇటు విద్యార్థుల ఉన్నతికి, దేశ రక్షణకు అందిస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైనిక్ స్కూల్ అనుమతి పొందడం జరిగిందని వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బీ.శేషారెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యాసంస్థల ద్వారా ఇప్పటికే సుమారు 20 వేల మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించడం తోపాటు 6 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. అత్యుత్తమమైన విద్యాప్రమాణాలతో విద్యార్థులకు విద్యతో పాటు శారీరక, మానసిక, మానవీయ విలువలతో కూడిన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. రాబోవు కాలంలో ప్రభుత్వ సైనిక్ స్కూలు అనుసంధానంతో కరికులం, యాక్టివిటీస్, కాంపిటీషన్స్ వంటి అన్ని సైనిక్ స్కూల్ సొసైటీ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇకపై ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించిన సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. విద్యాసంస్థలో ప్లస్-1 ఇంటర్ మీడియట్‌తో స్పెషల్ ఎన్‌డీఏను ప్రారంభిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో వెరిటాస్ సైనిక్ స్కూల్ డైరెక్టర్లు బీ.శ్రీకర్‌రెడ్డి, బీ.సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.